క్లుప్తంగా

పాఠశాలకు బెంచీలు బహూకరణ



భట్టిప్రోలు: పెదపులివర్రు గ్రామ పంచాయతీ పరిధిలోని పెదపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు వ్యవస్థాపక అధ్యక్షులు, పూర్వ విద్యార్థులు కలసి రూ. 40 వేల వ్యయంతో నాలుగు బెంచీలను శనివారం ఎంఈవో పులి లాజర్ చేతుల మీదుగా అందజేశారు. ఇందులో పాఠశాల పూర్వ విద్యార్థులు కొక్కిలిగడ్డ చలమయ్య-బుల్లెమ్మల జ్ఞాపకార్థం కుమారులు పున్నారావు, రవీంద్రబాబుల సహకారంతో రూ. 20 వేలు వ్యయం చేసే రెండు బెంచీలను అందించారు. వ్యవస్థాపక అధ్యక్షులు పాండుగుల వెంకటేశ్వరరావు, త్రివర్ణ సేవా సేమితి (ములకలూరు-నరసరావుపేట) పల్నాడు జిల్లా సహకారంతో రూ. 20 వేలు వ్యయం చేసే రెండు బెంచీలు అందజేశారు. కార్యక్రమంలో వెల్లటూరు క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు కె. అరుణకుమారి, ప్రధానోపాధ్యాయులు జీజీ ప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్ పి. పావని, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొని దాతలను అభినందించారు.

మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు మృతి



వేమూరు: స్థానిక మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు తలతోటి సువర్ణరాజు (60) శనివారం ఉదయం మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. వైఎస్సార్ సీపీకి విశిష్ట సేవలందించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన భౌతికకాయాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు.

విద్యార్థి దశ నుంచే పోటీతత్వం అవసరం

డీఈవో ఎస్. పురుషోత్తం



బాపట్ల టౌన్: విద్యార్థి దశ నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని డీఈవో ఎస్. పురుషోత్తం తెలిపారు. మండలంలోని చెరువుజమ్ములపాలెం జిల్లా పరిషత్ హైస్కూలులో శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత క్రమం తప్పకుండా ప్రతి ఏడాది హాకీ క్రీడలో జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న జమ్ములపాలెం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. వారికి సర్టిఫికెట్లు, మెమెంటోలను అందజేశారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించినప్పుడే ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ తాళ్ల వెంకటేష్ యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.వి. కృష్ణారావు, వ్యాయామ ఉపాధ్యాయుడు బోయిన వీరచంద్ర, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో సత్తా చాటిన తెనాలి విద్యార్థులు



తెనాలి: 'యూసీమాస్' సంస్థ ఇటీవల గుంటూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి, తర్వాత హైదరాబాద్‌లో జరిపిన జాతీయ స్థాయి అబాకస్ పోటీలో తెనాలిలోని మాస్టర్ బ్రెయిన్ అబాకస్ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటారు. వేలాదిగా పాల్గొన్న ఈ పోటీల్లో తెనాలి విద్యార్థులు టి.హేత్విక్, ఓ.షణ్ముఖ అభిరామ్, ఎ.విహాన్‌రామ్, కె.నాగహాష్విక్, ఎ.ప్రభంజన్, ఎస్‌డీ దీనాజ్‌రోష్ని, కె.నాగమిధున్, టి.తక్ష, వెంకటసాయి కిరణ్‌లు ప్రతిభ చూపి పలు అవార్డులను గెలుచుకున్నారు. విజేతలకు మాస్టర్ బ్రెయిన్ అబాకస్ డైరెక్టర్లు షేక్ షాఫియా, షేక్ షాకియాలు అభినందనలు తెలియజేశారు.

అన్న క్యాంటీన్‌కు ఆర్వో ప్లాంట్ వితరణ

తెనాలి టౌన్: స్థానిక బస్టాండ్ వద్ద గల అన్న క్యాంటీన్‌కు రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంట్‌ను శనివారం వితరణగా అందజేశారు. రోటరీ- 3150 గవర్నర్ సోమవరపు వెంకట రామప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని, ప్లాంట్‌ను ప్రారంభించారు. దాతల సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సభ్యులు ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం ముదావహమని కొనియాడారు. అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ మాట్లాడుతూ కొడాలి వెంకటేశ్వరరావు, భారతీదేవి, కావూరి శివరామకృష్ణ, అఖిలాండేశ్వరమ్మ, డాక్టర్ ధూళిపాళ్ల రవీంద్రనాథ్ సహకారంతో ఈ ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు నల్లూరి వెంకటేశ్వరరావు, గుమ్మడి వెంకటనారాయణ పాల్గొన్నారు.

జై గణేశా.. జైజై గణేశా !

కర్లపాలెం: వినాయక చవితి వేడుకల్లో భాగంగా కర్లపాలెం, పి.వి.పాలెం మండలాల్లోని పలు గ్రామాల్లో విగ్రహాలకు వైభవంగా పూజలు జరుగుతున్నాయి. కర్లపాలెం మండలంలోని సత్యవతీపేట, శీలంవారిపాలెం, కర్లపాలెం గౌడపాలెం, చిన పులుగువారిపాలెం గ్రామాల్లో నాలుగు రోజులుగా పూజలందుకున్న వినాయకుని విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు పూజలు చేసి హారతులిచ్చారు. అనంతరం గ్రామపెద్దలు, యువకులు కలసి విగ్రహాలను కాలువలలో నిమజ్జనం చేశారు. పి.వి.పాలెం మండలంలోని గణేష్‌నగర్, గోకరాజు నల్లిబోయినవారిపాలెం, అల్లూరి యాదవపాలెం, చందోలు ఎస్టీ కాలనీల్లో పూజలందుకున్న విగ్రహాలకు నగరోత్సవం నిర్వహించి, భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర, చందోలు ఎస్ఐ ఎం.వి. శివకుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఆకట్టుకున్న కోలాటం

బాపట్ల: వినాయక నిమజ్జనం సందర్భంగా శనివారం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద, ఎంపీడీఓ కార్యాలయం వద్ద అన్నదానాలు నిర్వహించారు. భీమావారిపాలెంలోని పార్కు వద్ద ఏర్పాటు చేసిన వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నిమజ్జనం చేపట్టారు. శ్రీ చైతన్య కళాశాలలో విద్యార్థులతో నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. జిల్లా నలుమూలల నుంచి భారీగా విగ్రహాలు నిమజ్జనానికి సూర్యలంక సముద్రానికి తరలి వచ్చాయి. ఆటంకాలు కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వైభవంగా నిమజ్జనాలు

చెరుకుపల్లి: వినాయక చవితి వేడుకలు సందర్భంగా శనివారం నాలుగో రోజు మండలంలో ఊరేగింపులు, అన్నదానాలు నిర్వహించారు. గుళ్లపల్లి, చెరుకుపల్లి, పొన్నపల్లి, నడింపల్లి, గూడవల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన శిబిరాల్లో కమిటీ సభ్యులు వేద పండితులతో ఉదయం, సాయంత్రం గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెరుకుపల్లి వీరరాఘవ పేటలో గణపతి నవరాత్రుల 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని భారీ అన్నదానం నిర్వహించారు. గుళ్లపల్లి అంబికా నగర్‌లో శ్రీ గణేష్ యూత్ ఏర్పాటు చేసిన వినాయకుని మండపంలో 25కేజీల లడ్డూకు వేలం పాట నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు వంగరు భాను, కుటుంబ సభ్యులు రూ. 1,00,116కు పాడారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సందడిగా విగ్రహం ఊరేగింపు

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని వలివేరులో గణేష్ విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు. తల్లిదండ్రులు ఖర్చులకు ఇచ్చిన డబ్బులతో విగ్రహాన్ని విద్యార్థులు ఏర్పాటు చేశారని గ్రామస్తులు తెలిపారు. విగ్రహాని శనివారం యడ్లపల్లి కాలువల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

గణేశుడికి అష్టోత్తర కలశాలతో పూజ

మండలంలోని చినపరిమిలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద శనివారం 108 కలశాలతో ఘనంగా పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆదివారం సాయంత్రం గణేశుడిని ఊరేగించి, నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.



శీలంవారిపాలెంలో గణేష్ నిమజ్జనానికి తరలి వచ్చిన గ్రామస్తులు



కర్లపాలెం సత్యవతీపేటలో విగ్రహాన్ని నిమజ్జనం కోసం తరలిస్తున్న గ్రామస్తులు



బాపట్ల చైతన్య కళాశాలలో విద్యార్థినుల కోలాటం



బాపట్ల పోలీసు స్టేషన్ వద్ద అన్నదానం



గుళ్లపల్లి అంబికా నగర్‌లో నిమజ్జనానికి గణనాథుడి తరలింపు



చెరుకుపల్లి వీరరాఘవ పేటలో అన్నదానం



వలివేరులో విగ్రహం ఊరేగింపు



చినపరిమిలో గణేశుడికి అష్టోత్తర పూజ

పోలీస్ కుటుంబాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

ఎస్పీ తుషార్‌డూడీ



బాపట్ల టౌన్: పోలీస్ కుటుంబాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లాలో ఉద్యోగ విరమణ చేసిన పోలీసులు, అమరవీరుల కుటుంబ సభ్యులతో శనివారం పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ యంత్రాంగం అంతా కుటుంబ సభ్యులుగా భావించి, ఎలాంటి సమస్య వచ్చినా తక్షణమే స్పందిస్తామని తెలిపారు. కారుణ్య నియామకాలు వేగవంతంగా జరిగే విధంగా తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ వి. శ్రీనివాసరావు, సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ షేక్ మౌలుద్దీన్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే పంచాయతీల పురోగతి



కొల్లూరు : పంచాయతీల పురోగతికి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం సమష్టి కృషి అవసరమని ఎంపీడీఓ కె. నరసింహారావు తెలిపారు. మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీల సుస్థిరాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పురోగతి సూచిక వెర్షన్ 1.0 నుంచి 2.0కు మారుస్తున్న తరుణంలో వాటికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. పంచాయతీల శాశ్వత అభివృద్ధి, పురోగతికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఈఓపీఆర్డీ సుబ్బారావు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు త్వరితగతిన అందించేందుకు చర్యలు

అమర్తలూరు(వేమూరు): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు త్వరితగతిన అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మండల విద్యాశాఖాధికారి వనజ తెలిపారు. అమర్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం ఉపాధ్యాయులతో క్లస్టర్ సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు సైన్సు పాఠ్య పుస్తకాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరారు. జిల్లాస్థాయి అధికారులతో మాట్లాడి పుస్తకాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎంఈఓ తెలిపారు. కిట్ల పంపిణీపై దృష్టి పెడతామని చెప్పారు. ఎఫ్ఏ -1 పరీక్షల నిర్వహణలో ఇబ్బందులను అధిగమించడానికి ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనపర్తి నిరీక్షణరావు, శ్రీధర్, శివశంకర్, సీఆర్పీలు పాల్గొన్నారు.

నూటికి నూరు శాతం హాజరు ఉండాలి

భట్టిప్రోలు: మండలంలోని ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూలులో శనివారం క్లస్టర్ పరిధిలోని ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో పులి లాజర్ మాట్లాడుతూ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులు నూటికి నూరు శాతం హాజరు ఉండేలా చూడాలని ఆదేశించారు. డిజిటల్ మౌలిక సదుపాయాల లభ్యతను నిర్ధారించడంతో పాటు షెడ్యూల్ ప్రకారం సెషన్స్ జరిగేలా చూసుకోవాలని తెలిపారు. ఆర్పీలను నియమించి అజెండాలు, గమనికల గురించి ముందుగానే తెలియ జేయాలని చెప్పారు. సమావేశంలో హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, మాచర్ల మోహన్‌రావు, వివిధ పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.



అమర్తలూరు హైస్కూలులో మాట్లాడుతున్న ఎంఈఓ వనజ

■ జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాల ప్రాధాన్యతను విద్యార్థులకు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు గుర్రం మురళీమోహన్ వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్టేట్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పడవలు తిరగడానికి అనుమతివ్వండి !

తహసీల్దార్‌ను కోరిన రైతులు, మత్స్యకారులు

కొల్లూరు : వ్యవసాయ అవసరాల కోసం కృష్ణా నదిలో పడవలు తిరగడానికి అనుమతించాలని రైతులు, మత్స్యకారులు కోరారు. మండలంలోని గాజుల్లంకకు చెందిన పలువురు శనివారం కొల్లూరు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లును కలసి విన్నవించారు. కృష్ణా జిల్లాలో పంట పొలాలు ఉన్న నేపథ్యంలో వ్యవసాయ పనుల కోసం నిరంతరం రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఉందని రైతులు తెలిపారు. నదిలో పడవలు తిరగకుండా నియంత్రించడం కారణంగా విజయవాడ, పెనుమూడి మీదుగా రాకపోకలు సాగించాలంటే దూరాభారంతోపాటు, ఎరువులు తరలింపు కష్టతరమవుతోందని వాపోయారు. వరద తగ్గుముఖం పట్టినందున పడవల రాకపోకలు సాగనిస్తే అవసరాలు గట్టెక్కుతాయని వివరించారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ నదిలో ప్రవాహం ఉద్ధృతంగా ఉన్నందున పడవల రాకపోకలకు అనుమతివ్వలేమని తెలిపారు. పడవ ప్రయాణ సమయంలో అనుకోని ప్రమాదాలు చోటు చేసుకుంటే ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందన్న విషయాన్ని గ్రహించాలన్నారు. వరదలు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో నదిలో నీటి మట్టం తగ్గిన అనంతరం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి రాకపోకలకు అనుమతిస్తామని స్పష్టం చేశారు. అప్పటి వరకు పడవల ద్వారా ప్రజలను తరలించరాదని ఆదేశించారు.



తహసీల్దార్‌తో రైతులు, మత్స్యకారులు

ఫొటోగ్రాఫర్ నాగరాజుకు అవార్డు



అవార్డు సాధించిన నాగరాజు తీసిన ఫొటో



అవార్డు అందుకుంటున్న నాగరాజు

బాపట్ల టౌన్: బాపట్ల మండలం ముత్తాయపాలెం గ్రామానికి చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ పీవీఎస్ నాగరాజుకు ఈనెల 28న యునైటెడ్ ఫొటో ఆర్టిస్ట్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కాంపిటీషన్‌లో అవార్డు లభించింది. ఆయన తీసిన గిరిజన జీవన శైలిని ప్రతిబింబించే ఛాయా చిత్రానికి రాష్ట్రస్థాయిలో మొదటి అవార్డు లభించింది. పీవీఎస్ నాగరాజుకు లయన్స్ క్లబ్, ఆటోనగర్ జేమ్స్ ప్రతినిధుల ఆధ్వర్యంలో శనివారం మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సాయన్న రాము, పారిశ్రామికవేత్త కె.బాలాజీ, యునైటెడ్ ఫొటో ఆర్టిస్ట్ ప్రెసిడెంట్ ఎం. రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య మెరుగుదలలో భాగస్వాములు కావాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



రేపల్లె: పారిశుద్ధ్య మెరుగుదలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ కోరారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో శనివారం నిర్వహించిన సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇళ్ల నుంచి సేకరించిన వ్యర్థాలను నిర్దేశిత ప్రదేశాలలో మాత్రమే పడవేయాలని ప్రజలకు సూచించారు. పారిశుద్ధ్య సిబ్బందికి తడి, పొడి చెత్తలుగా వేరు చేసి అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కౌన్సిలర్లతో పాటు అధికారులకు ఉందని ఆమె తెలిపారు. వార్డుల్లో సమస్యలను కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఈ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం ఎజెండాలోని 33 అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు, వైస్ చైర్మన్లు గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా హరికిషన్ బాధ్యతల స్వీకరణ



తెనాలి: పట్టణ కొత్తపేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2గా మాదినేని హరికిషన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన ఆ తర్వాత చేబ్రోలు, గుంటూరులో పని చేశారు. పదోన్నతిపై తెనాలికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన హరికిషన్‌ను సబ్ రిజిస్ట్రార్-1 కె.బుజ్జిబాబు, దస్తావేజు లేఖర్లు వజ్రాల రామలింగాచారి, వై.పేరయ్య, కార్యాలయ సిబ్బంది పుష్ప గుచ్ఛాలతో అభినందనలు తెలియజేశారు.

ప్రకృతిలో అపారమైన ప్రాణశక్తి

బాపట్ల: వాతావరణం, భావోద్వేగాలు, వయస్సు తారతమ్యంతో వచ్చే వ్యాధులను ప్రకృతిలోని అపారమైన ప్రాణశక్తిని పొందడం ద్వారా నయం చేసుకోవచ్చని ప్రాణిక్ హీలింగ్, అర్హటిక్ యోగా గ్రాండ్ మాస్టర్ చోవా కోక్ సుయ్ బాపట్ల కేంద్రం నిర్వాహకులు చంద్రపాటి రామనారాయణ పేర్కొన్నారు. యోగా గ్రాండ్ మాస్టర్ చోవా కోక్ సుయ్ జయంత్యుత్సవాల్లో భాగంగా శనివారం కొండుబొట్లవారిపాలెం ఎస్టీ కాలనీలో 100 మంది మహిళలకు చీరలు, దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిలోని ప్రాణశక్తే వ్యాధి నిరోధకశక్తికి కీలకమని గ్రాండ్ మాస్టర్ చోవా కోక్ సుయ్ నమ్మిన సిద్ధాంతంతో హీలింగ్ పవర్ సాధించారని వివరించారు. ప్రతి మనిషి ఆరోగ్యంగా జీవించడానికి రోజువారి దినచర్య క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. గురువు రవిశంకర్ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, జె.విశ్వనాథ్, జగదీష్, బాలాజీ, ఉప్పిరెట్ల శ్రీను, కంకణాల రాంబాబు, కాలనీ అధ్యక్షులు చెంచయ్య పాల్గొన్నారు.



ఎస్టీ కాలనీ వాసులతో రామనారాయణ తదితరులు

యూరియా కొరత లేకుండా చూడాలి

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

వేమూరు: రైతులకు, కౌలు రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డెల్టా ప్రాంతంలో ఎక్కువగా కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారని, వారికి ఎరువులు కొరత లేకుండా చూడాలని సూచించారు. ఇప్పటిదాకా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా నాలుగు వేల మెట్రిక్ టన్నులు యూరియా అందించామని తెలిపారు. రైతుల అవసరాలకు పది వేల మెట్రిక్ టన్నులు అవసరమని పేర్కొన్నారు. వ్యాపారుల వద్ద స్టాక్ చెక్ చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఎరువులను ఎక్కువ ధరలకు అమ్మితే లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్ పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, జొన్నలగడ్డ విజయబాబు, రైతులు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

క్రీడాకారులకు బహుమతులు పంపిణీ



షబీనాకు సర్టిఫికెట్‌ను అందిస్తున్న హెచ్‌ఎం రామకోటేశ్వరరావు, పీఈటీలు



క్రీడల పోటీలకు బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం, ఎస్ఎంసీ చైర్మన్ తదితరులు

భట్టిప్రోలు: క్రీడా, తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని భట్టిప్రోలు టీఎంరావు హైస్కూలులో శనివారం రాష్ట్ర వాలీబాల్ క్రీడాకారిణి సయ్యద్ షబీనాకు సర్టిఫికెట్‌ను ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు అందజేశారు. క్రీడాకారిణి తండ్రి మీరా జైలాబ్దిన్, పీఈటీలు చేబ్రోలు శ్రీనివాసరావు, ఎండీ అనూల్ హక్‌లను ఆయన అభినందించారు. హైస్కూలులో నిర్వహించిన మ్యూజికల్, 100 మీటర్ల రన్నింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులను ఎస్ఎంసీ చైర్మన్ అత్తోట సుగుణ కుమారి అందించారు.

కమిషనర్‌గా లక్ష్మీపతిరావు సేవలు ప్రశంసనీయం



తెనాలి అర్బన్: విధి నిర్వహణలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు అందరి మన్ననలను పొందారని మేనేజర్ విల్సన్ జయకర్ పేర్కొన్నారు. లక్ష్మీపతిరావు ఉద్యోగ విరమణ సందర్భంగా కొత్తపేటలోని రామకృష్ణ కవి కళా క్షేత్రంలో శనివారం వీడ్కోలు సభను ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జయకర్ మాట్లాడుతూ శానిటరి ఇన్‌స్పెక్టర్‌గా తెనాలిలో పనిచేసి, ఇదే మున్సిపాలిటీలో ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉద్యోగ విరమణ చేయడం అరుదుగా జరిగే సంఘటనగా పేర్కొన్నారు. ఆయన శేష జీవితం సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతిరావు మాట్లాడుతూ ఉద్యోగులంతా నిబద్ధతతో పని చేయడం వల్ల మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు సహకరించిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.